నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, మంగళవారం 31 డిసెంబర్ 2024 | SIDDIPET

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

- ఉజ్వల భవిష్యత్, ఉత్తమ ప్రతిభ పది నుంచే ప్రారంభం
- పదిలో సిద్దిపేట స్టేట్ ఫస్ట్ రావాలి
- అందులో మీ బిడ్డ ఉత్తమ ఫలితం సాధించాలి
- వచ్చే మూడు నెలలు టీవీలు, ఫోన్లకు దూరంగా ఉంచాలి
- టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులకు హరీశ్‌రావు ఉత్తరం

విద్యార్థుల తల్లిదండ్రులకు లేఖరాస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, డిసెంబర్ 30: ప్రపంచంలో హాని కలిగించని వ్యసనం ఏదైనా ఉంది అంటే అది చదువు మాత్రమేనని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు సోమవారం ఉత్తరం ద్వారా టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. మార్చిలో జరిగే టెన్త్ వార్షిక పరీక్షలకు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాలని హరీశ్‌రావు ఉత్తరంలో పేర్కొన్నారు. చదువును నమ్ముకున్న వారంతా తమ ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకున్నారని పేర్కొన్నారు. పేద కుటుంబాల్లో జన్మించి దేశాలను పాలించే స్థాయికి ఎదిగిన వారు కొందరైతే, నేటి సాంకేతిక యుగానికి సంస్కరణలు రచించిన వారు ఇంకెందరో ఉన్నారని, ప్రణాళికాబద్ధమైన చదువు మన తలరానే మారుస్తుందనడానికి ఎన్నో సజీవ సాక్ష్యాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా మాజీమంత్రి హరీశ్‌రావు ఉత్తరంలో ఇలా రాశారు.

కష్టంగా కాకుండా, ఇష్టంగా చదివించండి

"మరి కొద్ది రోజుల్లో మీ పిల్లలు టెన్త్ పరీక్షలు రాయబోతున్నారు. వారి చదువులో ఇది అత్యంత కీలకమైన ఘట్టం. ఇది మంచి మార్కులతో గట్టెక్కితేనే ఉన్నత చదువుల దిశగా ముందడుగు వేసే అవకాశం ఉంటుంది. లేదంటే మీరు ఇన్నాళ్లు పడిన కష్టానికి, మీ పిల్లల చదువుకు ఎలాంటి అర్థం ఉండదన్నారు. మీ పిల్లలు తమ చదువుల్లో విజయం సాధించాక మీరు ఇచ్చే అభినందన కన్నా మీ పిల్లలు పరీక్షలు రాసే ముందు మీరు తీసుకునే ప్రత్యేక శ్రద్ధ ఎంతో ముఖ్యం. అందుకే వార్షిక పరీక్షలు ముగిసేదాకా పిల్లలపై దృష్టి పెట్టాలి. ముఖ్యంగా సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచండి. వినోదాలు, ఘంక్షన్లు, సినిమాలు, టీవీల జోలికి వెళ్లకుండా చూడండి. మీ ఇంటికి సంబంధించిన పనులను కూడా చెప్పవద్దు. ఈ పోటీ ప్రపంచంలో సాదాసీదాగా కాకుండా ప్రతిభను చాటితేనే మంచి అవకాశాలు వస్తున్నాయని, మీ ఆశలకు, మీ పిల్లల ఆశయాలకు వారధిగా నేను నిలవాలని, నాలుగేండ్లుగా సిద్దిపేట నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థులంతా అత్యధిక మార్కులు సాధిస్తున్నారు. నూటికి నూరు శాతం పాసవుతున్నారు. ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థల్లోనూ 169 మంది సిద్దిపేట నియోజకవర్గ విద్యార్థులు గతేడాది సీట్లు సాధించడం గర్వకారణం. ఉచిత ఇంజినీరింగ్ విద్యతోపాటు మంచి ఉద్యోగాలను దక్కించుకుంటున్నారు. మీ పిల్లలు మంచి మార్కులతో పాస్ కావాలనేదే నా ఆకాంక్ష. నా తపన. నా వంతుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులతో పాటు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నాను. జిల్లా విద్యాధికారి నుంచి మీ పిల్లలకు చదువు చెప్పే ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో కూడా సమీక్షలు నిర్వహిస్తాను. వారి స్కూళ్లలో సౌకర్యాలు కల్పించడం జరిగింది. ఒక్క మార్కు కూడా తగ్గకుండా డిజిటల్ కంటెంట్ ద్వారా ప్రతి సబ్జెక్ట్‌పై అవగాహన కల్పిస్తున్నాం. అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిచిన సిద్దిపేట నియోజకవర్గ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో కూడా ఆదర్శంగా నిలవాలనేదే నా తాపత్రాయం. ప్రజాప్రతినిధిగా, మీ కుటుంబంలో ఒకడిగా నా వంతు ప్రయత్నం నేను చేస్తున్నాను. మీరు కూడా మీ పిల్లలను బాగా చదివించండి. చదువుతో పాటు చేతిరాత చక్కగా ఉండేలా చూడండి. ఇక మీ పిల్లల భవిష్యత్ మీ చేతుల్లోనే ఉంది." కష్టంగా కాకుండా ఇష్టంగా చదివించాలని, మీ పిల్లల బంగారు భవితకు బాటలు వేయాలని ఉత్తరం ద్వారా హరీశ్‌రావు విద్యార్థుల తల్లిదండ్రుల్లో చైతన్యం తెచ్చారు.

పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు మాజీమంత్రి హరీశ్‌రావు రాసిన ఉత్తరం

ప్రజావాణికి అనూహ్య స్పందన

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 30:కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నదని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు అర్జీలను అధికారులకు అందజేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ప్రజావాణిలో మొత్తం 72 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా అర్జీలను సకాలంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీవో పద్మజారాణి, అర్డీవో రవీందర్‌రెడ్డి, ఏవో పరమేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

పంచాయతీ పోరుకు కసరత్తు

ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారులు

సిద్దిపేట, డిసెంబర్ 30(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు కసరత్తు జరుగుతుంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాల యంత్రాంగాలు ఆ పనిలో నిమగ్నమయ్యాయి. వారం పది రోజుల నుంచి ఏర్పాట్లను ముమ్మరం చేసింది. జిల్లాల్లోని గ్రామాల వారీగా ఓటరు జాబితాలను ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో విడుదల చేశారు. గ్రామాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు తదితర పనులు పూర్తి చేసింది. పంచాయతీ ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేందుకు కొంతమంది అధికారులను నోడల్ అధికారులుగా నియమించి వారికి బాధ్యతలను సైతం అప్పగించింది. వీరి నేతృత్వంలో పంచాయతీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పని విభజన చేసింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏర్పాట్లు జరుగుతున్నట్లు జిల్లా అధికార యంత్రాంగం చెబుతోంది. ఇప్పటికే జిల్లా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లాలకలెక్టర్లు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. రిజర్వేషన్లపై ఒక స్పష్టత వస్తే ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం అయినట్లే. ఎప్పుడు ఎన్నికలు నిర్వహించినా జిల్లాల అధికార యంత్రాంగాలు సిద్ధంగా ఉండే విధంగా చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. గ్రామాల్లో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఏడాది కాలంగా ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతుంది. దీంతో గ్రామాలకు ఎలాంటి నిధులు రాక పారిశుధ్యం, ఇతర పనులు ఎక్కడికక్కడే నిలిచిపోతున్నాయి. కాంగ్రెస్ పాలనలో నయాపైసా రాక గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు.

జిల్లాలో నోడల్ అధికారుల నియామకం

సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్ జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంచాయతీ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికల సిబ్బంది నియామకం, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, బ్యాలెట్ బాక్స్‌ల నిర్వహణ, రవాణా, పోలింగ్ అధికారులకు శిక్షణ, ఎన్నికల సామగ్రి తరలింపు, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, బ్యాలెట్ పత్రాల ముద్రణ, మీడియా కమ్యూనికేషన్, హెల్ప్‌లైన్ తదితర పనుల నిర్వాహణ సజావుగా జరిగేవిధంగా జిల్లా అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. వీరి నేతృత్వంలో ఆయా విభాగాల్లో పనులు జరగనున్నాయి. ఈ 12 విభాగాలకు సిద్దిపేట జిల్లాలో 18 మంది, సంగారెడ్డి జిల్లాలో 12 మంది, మెదక్ జిల్లాలో 12 మందిని నోడల్ అధికారులుగా నియమించారు. ఎన్నికల నిర్వహణకు వచ్చిన మెటీరియల్‌ను వీరు సరి చూసుకుంటున్నారు. జిల్లాకు అవసరమైన బ్యాలెట్ బాక్స్‌లు ఆయా కలెక్టరేట్ల సమీపంలోని గోదాంలో నిక్షిప్తంగా ఉంచారు. ఆ బ్యాలెట్ బాక్స్‌లు సరిగ్గా ఉన్నాయా..? లేవా అని సరిచూస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సరిపడా సామగ్రి జిల్లాలకు చేరుకుంది. సిద్దిపేట జిల్లాలోని 23 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ముసాయిదా జాబితా ఇంతవరకు విడుదల కాలేదు. కొన్ని సాంకేతిక కారణాలతో విడుదల కావడం లేదని అధికారులు చెబుతున్నారు. మరో వైపు ఆ గ్రామాల్లో ముసాయిదా జాబితా విడుదల కాకపోవడంతో ఒక రకంగా సందిగ్ధత ఏర్పడిందని చెప్పవచ్చు. సిద్దిపేట నియోజకవర్గంలోని సిద్దిపేట రూరల్ మండలానికి చెందిన 15 గ్రామాలు ఉన్నాయి. వీటితో పాటు తొగుట మండలంలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురైన ఎనిమిది గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం ఈ ఎనిమిది గ్రామాలకు గజ్వేల్ వద్ద ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను కట్టించారు. ముంపు గ్రామాలకు సంబంధించి ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

రిజర్వేషన్లలో మార్పులు..?

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టాన్ని సవరించడంతో రిజర్వేషన్లు మారే అవకాశాలు ఉన్నాయి. వీటితో పాటు మరి కొన్ని నిబంధనలు అమలులోకి రానున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల పాటు ఒకే రిజర్వేషన్ ఉండేలా చట్టం చేసి గ్రామ పంచాయతీల రిజర్వేరేషన్లను పూర్తి చేసి ఎన్నికలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ చట్టం ప్రకారం ఈ విడత కూడా అదే రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు జరగాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తాజాగా శాసనసభలో పంచాయతీరాజ్ చట్టాన్ని సవరించడంతో రిజర్వేషన్లు మారనున్నాయి. చట్ట సభలో బిల్లు ఆమోదం కావడంతో పంచాయతీ ఎన్నికల్లో పలు ప్రాధాన్యతలు చోటు చేసుకోనున్నాయి. ఇప్పటికే గ్రామాల్లో ఆశావహులు తమ అనుచరులతో సమావేశాలు నిర్వహించుకోవడం, రిజర్వేషన్ మనకే అనుకూలంగా వస్తుంది అంటూ లెక్కలు వేసుకోవడం.. ఒకవేళ మనకు అనుకూలంగా రాకపోతే ఏం చేయాలి... రిజర్వేషన్ అనుకూలంగా వస్తే నాకు సపోర్టు చేయాలి. ఒక వేళ నీకు అనుకూలంగా వస్తే నీకు సపోర్టు చేస్తా అంటూ ఇప్పుడే గ్రామాల్లో సంప్రదింపులు చేసుకుంటున్నారు. యువతను మచ్చిక చేసుకునే పనిలో కొంత మంది ఆశావహులు ఉన్నారు. ఇలా ఏదో ఒక రకంగా గ్రామాల్లో పంచాయతీ ఎన్నికల సందడి కనిపిస్తున్నది.

- రిజర్వేషన్లు ఎలా ఉంటాయోనని ఆశావహుల్లో టెన్షన్
- గ్రామాల్లో నెలకొన్న పంచాయతీ ఎన్నికల సందడి

సిద్దిపేట జిల్లా

గ్రామ పంచాయతీలు	491
వార్డులు	4,350
మొత్తం ఓటర్లు	6,23,813
పురుష ఓటర్లు	3,06,285
మహిళా ఓటర్లు	3,17,521
ఇతరులు	7
నోడల్ అధికారులు	18

మెదక్ జిల్లా

పంచాయతీలు	493
వార్డులు	4,232
మొత్తం ఓటర్లు	5,19,009
పురుషులు	2,49,926
మహిళలు	2,69,074
ఇతరులు	9
నోడల్ అధికారులు	12

సంగారెడ్డి జిల్లా

గ్రామ పంచాయతీలు	646
వార్డులు	5,718
మొత్తం ఓటర్లు	8,51,420
పురుష ఓటర్లు	4,23,629
మహిళా ఓటర్లు	4,27,739
ఇతరులు	52
నోడల్ అధికారులు	12

బొంతపల్లి కమాన్ వద్ద ఆందోళన చేస్తున్న నాలుగు గ్రామాల ప్రజలకు నచ్చచెబుతున్న పోలీసులు

బల్దియాతో మా బతుకులు ఆగం చేయొద్దు

మున్సిపాలిటీ వద్దంటూ జాతీయ రహదారిపై ప్రజల ధర్నా

గుమ్మడిదల, డిసెంబర్ 30: బల్దియాతో మా గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఆగం చేయవద్దని గుమ్మడిదల మున్సిపాలిటీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మెదక్-బాలానగర్ జాతీయ రహదారిపై నాలుగు గ్రామాల ప్రజలు ధర్నా, రాస్తారోకో చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామ పంచాయతీకి చెందిన మాజీ సర్పంచ్ ఆలేటి నవీనాశ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సద్ది విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ఆ గ్రామాలకు చెందిన ప్రజలు, పలు పార్టీల నాయకులు మున్సిపాలిటీ ఏర్పాటును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గంట పాటు నిరసన వ్యక్తం చేయడంతో ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు స్తంభించిపోయాయి. వీరికి మద్దతుగా గుమ్మడిదల మండల రైతులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, దోమడుగు, వీరన్నగూడెం మాజీ సర్పంచ్‌లు అభిశెట్టి రాజశేఖర్, పొన్నబోయిన మమతావేణు ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పచ్చని పంట పొలాల్లో కాలం వెళ్లదీస్తున్న మా గ్రామాల ప్రజలను పన్నుల రూపంలో అన్యాయం చేయవద్దని ప్రభుత్వానికి సూచించారు. సర్కారు తీసుకున్న మున్సిపాలిటీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ చేయడం వల్ల సామాన్య ప్రజలపై పన్నుల భారం పడుతుందన్నారు. ఉపాధిహామీ పనులతో మండలంలో 4వేల మంది కూలీలు బతుకుతున్నారని పేర్కొన్నారు. మున్సిపాలిటీ చేయడం వల్ల పనులు లేక ఉపాధి కోల్పోతారని సర్కారుకు సూచించారు. ఇప్పటికే అన్నారం సమీపంలో ఎయిర్‌ఫోర్స్ అకాడమీ ఉండడం వల్ల బహుళ అంతస్తులకు అనుమతులు లేక అభివృద్ధి కుంటుపడిందన్నారు. మున్సిపాలిటీ నిర్ణయాన్ని పునరాలోచించి గ్రామ పంచాయతీలుగానే కొనసాగేంచే విధంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆందోళనకారులకు పోలీసులు నచ్చచెప్పి ఆందోళన విరమింపజేయించారు. కార్యక్రమంలో చక్రపాణి, గటాటి రమేశ్, సుంకరిశంకర్, మురళి, మంగయ్య, ముద్దంగుల గోపాల్, మడపతి గణేశ్, వినోద్‌గౌడ్, యాదగిరి, మహేశ్, జైపాల్‌రెడ్డి, భద్రయ్య, గరీబ్, శ్రీను పాల్గొన్నారు.

ప్రజల ఆశీర్వాదంతోనే శాసనసభకు..

ఎమ్మెల్యే మాణిక్‌రావును సన్మానిస్తున్న మైనార్టీ నాయకులు

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు

ఝరాసంగం, డిసెంబర్ 30: సొంతూరి ప్రజల ఆశీర్వాదంతోనే శాసనసభకు వెళ్లానని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలో రూ.20 లక్షలతో మంజూరు చేసిన షాదీఖానా నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. షాదీఖానా నిర్మాణానికి నిధుల కొరత ఏర్పడితే సీడీపీ నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఝరాసంగంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని, గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. హాస్టల్‌లో ఉన్న సమస్యలతో పాటు వసతిగృహం ఆవరణ బయట చెత్తను డంపు చేస్తుండడంతో పిల్లలు ఇబ్బంది పడుతున్నారని వసతి గృహం వార్డెన్ వెంకటేశం ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే ఎంపీడీవోతో ఫోన్‌లో మాట్లాడి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సూచించారు. మైనార్టీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను సన్మానించారు. కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని ఎమ్మెల్యే దర్శించారు. ఆలయ ఈవో శివరుద్రప్ప ఎమ్మెల్యేను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకటేశం, మాజీ అధ్యక్షుడు సంగమేశ్వర్, ఝరాసంగం పట్టణాధ్యక్షుడు ఎజాజ్‌బాబా, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు జగదీశ్వర్, ఆలయ మాజీ చైర్మన్ నర్సింహగౌడ్, షేక్ సోయల్, ఖలీల్, బషీర్ మియా, జహీర్‌సాబ్, బాబుమియా, వెంకట్‌రెడ్డి, నవాజ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కిషన్, భోజిరెడ్డి పాల్గొన్నారు.

మండపారాధన పూజలో పాల్గొన్న అర్చక దంపతులు

గర్భాలయంలో లక్ష బిల్వార్చన చేస్తున్న అర్చకులు

భక్తిశ్రద్ధలతో లక్ష బిల్వార్చన

ముగిసిన కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవం

చేర్యాల, డిసెంబర్ 30: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం ఆలయ వర్గాలు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామి వారికి లక్ష బిల్వార్చన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవనం కొనసాగించేందుకు స్వామి వారు అనుగ్రహించాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. అనువంశిక వీరశైవ ఆగమ శాస్త్రం ప్రకారం స్వామివారి ఆలయంలో స్వస్తిక్ పుణ్యహవచనం, గణపతిపూజ, పంచచార్య పూజలు, రుద్రాభిషేకం, బిల్వార్చన, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం, మహానైవేద్యం తదితర పూజలను అర్చకులు నిర్వహించారు. లక్ష బిల్వాలను(మారేడు) స్వామి మూలవిరాట్ వద్ద సమర్పిస్తూ 1008 మల్లన్న నామస్మరణలను పటిస్తూ అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో బిల్వార్చన పూజలు కొనసాగించారు. పూజల్లో ఆలయ అర్చకుడు పడిగన్నగారి మల్లికార్జున్ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకుడు శ్రీరాములు, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణోత్సవం

రెండు రోజుల పాటు స్వామి వారి కల్యాణోత్సవాన్ని ఆలయవర్గాల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించిన అర్చకులు, లక్ష బిల్వార్చన, మహాన్యాసపూర్వక పూజలతో కల్యాణ వేడుకలు ముగిసినట్లు ప్రకటించారు.రానున్న సంక్రాంతి పర్వదినం అనంతరం వచ్చే మొదటి ఆదివారం పట్నం వారంతో తిరిగి జాతర ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మొదటి ఆదివారం పట్నం వారం సందర్భంగా హైదరాబాద్ భక్తులు పట్నం, అగ్నిగుండాల కార్యక్రమాలు నిర్వహించుకుంటారని,మొదటి వారానికి సుమారు లక్ష మంది భక్తులు కొమురవెల్లికి తరలివస్తారని వారు వెల్లడించారు.స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలు విజయవంతంగా ముగియడంతో ఆలయవర్గాలు ఆలయ సంప్రదాయం మేరకు ఆలయ సిబ్బందిని ఈవో ఆధ్వర్యంలో అర్చకులు సన్మానించారు.

ఇప్పటికైతే అర్ధాంగీకారం..రేపు ప్రశ్నార్థకం ?

- చిట్కుల్ సర్కారు భూమి కబ్జాలపై అధికారుల విచారణ తీరు
- నిర్మాణాలు ఆపాలని కబ్జాదారులకు నచ్చజెప్పిన అధికారులు
- అధికారులను చుట్టుముట్టిన కబ్జాదారులు

అధికారులను చుట్టుముట్టి వాగ్వాదం చేస్తున్న నిర్మాణదారులు

పటాన్‌చెరు, డిసెంబర్ 30: ఇప్పటికైతే అర్ధాంగీకారం..రేపు ప్రశ్నార్థకం.? లాగా ఉంది అధికారుల స్పందన. సంగారెడ్డి జిల్లా చిట్కుల్‌లో సర్వేనెంబర్ 329లో ప్లాట్లు, ఖాళీ జాగాలు కబ్జా చేస్తున్నారని ఆదివారం 'నమస్తే తెలంగాణ దినపత్రిక'లో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. సోమవారం గ్రామంలోని సర్వే నెంబర్ 329లో తహసీల్దార్ రంగారావు, ఎంపీవో హరిశంకర్ గౌడ్ సిబ్బందితో కలిసి కబ్జా చేసి కడుతున్న నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా భారీగా కొనసాగుతున్న నిర్మాణాల వద్దకు వెళ్లి కబ్జా చేస్తున్న వ్యక్తులను పనులు ఆపాలని కోరారు. ఇవన్నీ అక్రమ నిర్మాణాలని అధికారులు పేర్కొన్నారు. అధికారుల రాక తెలియడంతో స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో అక్కడికి వచ్చి అధికారులతో వాగ్వాదం చేశారు. 2008లో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. అప్పుడు మంత్రిగా దామోదర ఇచ్చిన పట్టాలే ప్రామాణికమని, వాటిలో పేర్కొన్న జాగాల్లోనే నిరుపేదలు నిర్మాణాలు చేస్తున్నారని మాజీ ప్రజాప్రతినిధులు, చిట్కుల్ నాయకులు వివరించారు. నిర్మాణాలు చేపట్టిన వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులు, నాయకుల అనుచరులు చుట్టుముట్టి అధికారులతో వాగ్వాదాలు ప్రారంభించారు. పాత ప్లాట్ల పట్టాలు అనుమతించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. స్పందించిన అధికార బృందం ఇప్పటివరకు చేసిన పనులు నిలిపివేయాలని, ఒక వేళ ఎవరైనా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామన్నారు. అనంతరం అధికారులు పట్టాలను పరిశీలించారు.

ఆంధ్రప్రదేశ్ సర్కారు ఇచ్చిన పట్టాలతోనే నిర్మాణాలు

2008లో ఏపీ సర్కారు పంపిణీ చేసిన పట్టాలతో నిర్మాణాలు జరుగుతున్నాయి. అప్పుడు ఇచ్చిన 518 పట్టాల్లో సగం అన్యాక్రాంతం అయ్యాయని రెవెన్యూ శాఖ తనిఖీలో (2008లో) తేలడంతోనే ఆ పట్టాలను రద్దు చేశారు. కొందరు గ్రామస్తులు, కాలనీవాసులను మాత్రమే అర్హులని తేల్చారు. అప్పటి రిపోర్టు కారణంగానే నాయకులు, ప్రజాప్రతినిధులు, వారి అనుచరుల నిర్మాణాలను కూల్చేశారు. అప్పుడు కూల్చిన ప్లాట్ల ఓనర్లే ఇప్పుడు మళ్లీ కడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో కుటుంబం నుంచి ముగ్గురు, నలుగురు ప్లాట్లు పొందటంతోనే 2008లో అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. 2008నాటి పట్టాలను చూపి ప్రభుత్వ స్థలం కబ్జా చేస్తున్నారు. ఇచ్చిన పట్టాల కాలపరిమితి రెండేండ్లు మాత్రమే. త్వరలో చిట్కుల్ గ్రామ పంచాయతీని ఇస్నాపూర్ మున్సిపాలిటీలో కలిపేందుకు ప్రకటన రాబోతున్నదని పలువురు నాయకులు కబ్జాలకు ఒడిగట్టారు. త్వరలో గెజిట్ వస్తుందని, అంతలోగా ఇండ్లు నిర్మించి కరెంట్, నల్లా తీసుకునేందుకు ప్లాన్ చేశారు. అధికారులు ఉదయం పనులు నిలిపివేస్తే సాయంత్రం తిరిగి ప్రారంభించడం కొసమెరుపు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో అదనపు కలెక్టర్ నగేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఇస్లాంపూర్ గ్రామస్తులు

మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్

మెదక్, డిసెంబర్ 30 (నమస్తేతెలంగాణ): ప్రజావాణిలో వివిధ సమస్యలతో ప్రజల నుంచి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని మెదక్ అదనపు కలెక్టర్ నగేశ్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లాలోని సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో సంబంధిత అధికారులతో కలిసి ఆయన 72 అర్జీలు స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు కేటాయిస్తూ ప్రజాసమస్యలపై తగిన చర్యలు తీసుకొని, త్వరగా పరిష్కరించేందుకు కృషిచేయాలని అధికారులకు సూచించారు. ధరణి -18, పింఛన్లు-4, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులు-18, పంట రుణమాఫీ 7- ఇతర సమస్యలపై 25 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ ప్రజావాణిలో డీఆర్‌వో భుజంగ రావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో పంచాయతీ కార్యదర్శి ఇష్టారాజ్యం

పంచాయతీ నిధుల దుర్వినియోగం, అవకతవకలకు పాల్పడిన పంచాయతీ సెక్రటరీ, మాజీ సర్పంచ్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలని తూప్రాన్ మండలం ఇస్లాంపూర్ గ్రామస్తులు తిరుపతిరెడ్డి, శ్రీరాములు, సుధాకర్‌రెడ్డి, గోపిరెడ్డి, రాజు సోమవారం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ నగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇస్లాంపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి తుపాకుల కల్పన విధి నిర్వహణలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 14 లోని ప్రభుత్వభూమిలో ఇండ్లు నిర్మిస్తూ ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఉపాధి హామీ పథకం పనుల్లో 2020 నుంచి 2024 వరకు అవకతవకలు జరిగాయని, మాజీ సర్పంచ్ జంగం సుకన్యారమేశ్, ఫీల్డ్ అస